అంగవైకల్యం దేహానికి మాత్రమే

● శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

పంజాగుట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం కేవలం దేహానికి మాత్రమేనని, బుద్ధి బలానికి సంబంధించినది కాదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పీవీ నరసింహారావు మార్గ్‌లో అవగాహన వాక్ నిర్వహించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్యా కిషన్‌రెడ్డితో కలిసి ఆయన వాక్‌ను ప్రారంభించారు.



పోచమ్మ ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్

పంజాగుట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ విస్తరణలో భాగంగా ఎర్రమంజిల్ కాలనీలోని ప్రభుత్వ క్వార్టర్స్ ఆవరణలో ఉన్న పోచమ్మ దేవాలయాన్ని తొలగించి మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా బంజారాహిల్స్ ట్రాఫిక్ పీఎస్ పక్కన నిర్మిస్తున్నారు. శుక్రవారం ఆలయ నిర్మాణ పనులను ఖైరతాబాద్ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు.

లోన్ ఇప్పిస్తానని నమ్మించి రూ.1.10 లక్షల లూటీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాను ఐసీఐసీఐ బ్యాంకు రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నానని, బ్యాకెండ్ ద్వారా రుణం ఇప్పిస్తామని యువకుడిని నమ్మించి రూ.1.10లక్షలు కొల్లగొట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 27 ఏళ్ల యువకుడు పర్సనల్ లోన్ కోసం గూగుల్‌లో వెతుకుతుండగా ఓ నంబర్ కనిపించింది. అవతలి వ్యక్తి ఐసీఐసీఐ ప్రతినిధిగా చెప్పుకున్నాడు. లోన్ మంజూరు చేయాలంటే పలు డాక్యుమెంట్లు పంపాలని కోరడంతో బాధితుడు పంపించాడు. బ్యాక్ ఎండ్ ద్వారా లోన్ మంజూరు చేయిస్తాననడంతో ప్రాసెస్ ఫీజు కోసం రూ.40వేలు పంపించాడు. ఆ తర్వాత బ్యాంకు మేనేజర్ తండ్రి మృతి చెందడంతో లోన్ ప్రాసెస్ ఆలస్యమైందని చెప్పాడు. ఆ తర్వాత కొద్దిరోజులకు కొత్త మేనేజర్ వచ్చాడని, మళ్లీ ప్రాసెస్ మొదటికి వచ్చిందంటూ విడతల వారీగా రూ.1.10లక్షలు తీసుకుని స్పందించడం మానేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతిని బెదిరిస్తున్న యువకుడిపై కేసు

బంజారాహిల్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువతితో పాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేయడమే కాకుండా తన వద్ద ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరిస్తున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. యూసుఫ్‌గూడలో ఉండే ఓ యువతికి అమెర్ బిన్ సిద్దిఖీతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో నాలుగేళ్ల పాటు సహజీవనం చేసి నాలుగు నెలల క్రితం విడిపోయారు. అప్పటి నుంచి ఆమెను ఇబ్బందులకు గురిచేయడంతో పాటు దాడి చేసి బెదిరింపులకు దిగడంతో యూసుఫ్‌గూడ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు..

అత్తింటి వారిపై కేసు నమోదు

బంజారాహిల్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం గృహిణిని వేధిస్తున్న అత్తింటి వారిపై కేసు నమోదైంది. అత్తాపూర్‌కు చెందిన మర్యం రేజాకు షేక్‌పేటకు చెందిన ఖలీముల్లా ఖలీల్ అహ్మద్‌తో కొద్దికాలం క్రితం వివాహమైంది. వివాహ సమయంలో రూ.పది లక్షల విలువ చేసే ప్లాటు, బంగారు అభరణాలు, రూ.1.50 లక్షల నగదు ఇచ్చారు. అయితే పెళ్లైన మొదటి రోజు నుంచే ఆమెను శారీరకంగా వేధించడం మొదలు పెట్టిన భర్త, అత్త, మామ, ఆడపడుచు అదనపు కట్నం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పుట్టింటి నుంచి డబ్బు తీసుకురాకపోతే బెడ్‌రూంలో కెమెరా పెట్టామని, ఆ వీడియోలను సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరించారు. మరోవైపు ఆడపడుచు భర్త, మరిది తమ కోరిక తీర్చాలంటూ వేధించడంతో బాధితురాలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓఎల్ఎక్స్‌లో స్కూటీ అమ్ముతామంటూ మోసం

బంజారాహిల్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూటీ అమ్ముతామని ఓఎల్ఎక్స్‌లో పోస్ట్ పెట్టిన సైబర్ నేరగాళ్లు టెలికాం ఇంజనీర్‌ను మోసం చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లో నివసించే వ్యాదివీర మణికంఠ టెలికాం ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం ఓఎల్ఎక్స్‌లో స్కూటీ అమ్మకానికి ఉండటాన్ని గమనించాడు. అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి రూ.25 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. రిజిస్ట్రేషన్ చార్జీలతో కలిపి రూ.25,670లు ఆన్‌లైన్ ద్వారా పంపించాడు. అయితే రోజులు గడిచినా స్కూటీ డెలివరీ కాలేదు. మోసపోయినట్లు గ్రహించిన మణికంఠ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దివ్యాంగులకు వీల్‌చైర్లను అందజేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా

యూసుఫ్‌గూడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డివిజన్ ప్రజలకు తాను నిరంతరం అందుబాటులో ఉంటానని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రహ్మత్‌నగర్ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ వారి దివ్యాంగుల సాధికారత ద్వారా మంజూరైన వీల్‌చైర్‌లను పంపిణీ చేశారు. అనంతరం రహ్మత్‌నగర్‌కు చెందిన ఆలీపాషాకు రూ.47.5వేల ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇబ్బందుల్లో ఉన్న వారిని సీఎం రిలీఫ్ ఫండ్ ఆదుకుంటుందని, ప్రవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారు మెడికల్ బిల్లులతో తనను సంప్రదిస్తే ఆర్థిక సహాయం అందేలా చూస్తానన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

బంజారాహిల్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, దళిత సంఘాల నేతలు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2, సోమాజిగూడలో ఎమ్మెల్యే దానంనాగేందర్, కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు కాటూరి రమేష్, ఆకుల రాజు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాడిగారి బోజిరెడ్డి, గడ్డం వెంకటేష్, ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

బీసీ కమిషన్ కార్యాలయంలో..

పంజాగుట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలకు అన్ని రంగాల్లో సమాన వాటా దక్కేలా రాజ్యాంగాన్ని రూపొందించడంలో అంబేడ్కర్ కనబరిచిన దార్శనికత మహోన్నతమైనదని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బీసీ కమిషన్ సభ్యులు, సిబ్బందితో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంగళరావునగర్‌లో..

అంబేడ్కర్ కోట్లాది మంది గుండె చప్పుడు అని ఏపీ రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీపీ రవిశేఖర్ రెడ్డి అన్నారు. డా. బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ విగ్రహానికి సుప్రీంకోర్టు న్యాయవాది అన్వర్ ఖాన్,స్థానిక యువతతో కలిసి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్ అలీఖాన్, మునావర్, ఫారూఖ్, నాగరాజు, నాళం రాజు గుప్తా, వినయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సోమాజిగూడ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్, నారికెళ్ల నరేష్ తదితరులు



ఫిలింనగర్ జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



బీసీ కమిషన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



ఎర్రగడ్డలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీ టీడీపీ నేత బి.వెంకన్న, పార్టీ నాయకులు ఎస్.ఆంథోని, ఎస్.ధనరాజ్ తదితరులు



నివాళులర్పిస్తున్న రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి



బోరబండ సైట్-3లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, కాంగ్రెస్ నాయకులు



నివాళులర్పించిన మాల సంఘం నాయకులు కట్టా బలరాం, కడవారి లక్ష్మణ్, శ్రీనివాస్, శివ, కృష్ణ, నరేష్ తదితరులు

డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిద్దాం

● మంత్రి సీతక్క ● 2కె రన్ పోస్టర్ ఆవిష్కరణ

పంజాగుట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్ల బారిన పడొద్దని, అందరం కలిసి డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిద్దామని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21న తెలంగాణ విద్యాసమితి ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో నిర్వహించనున్న 2కె రన్ పోస్టర్‌ను శుక్రవారం ఆమె సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ 2కె రన్‌లో యువత పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పి.తారక్‌గౌడ్, రేవంత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి, అందె రవికుమార్, భరత్, సంతోష్ నాయుడు, మారుతి, రఘు, శ్రీను నాయక్, అశోక్, రాజబాబు పాల్గొన్నారు.



2కె రన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమం

● డా. కోట నీలిమ

బేగంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా బేగంపేట డివిజన్ పాటిగడ్డలో కాంగ్రెస్ పార్టీ నేత విశాల్ సుధాం అధ్వర్యంలో ప్రజాపాలన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేద ప్రజలకు సంక్షేమం సాధ్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపాలన సమన్వయకర్త ఉజ్మాషాకి, షంషుద్దీన్, జగదీష్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కోట నీలిమ, విశాల్ సుధాం తదితరులు

రాష్ట్ర ప్రగతికి పరిశ్రమలు కీలకం

● మంత్రి శ్రీధర్‌బాబు

అమీర్‌పేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్లడంలో, ఉపాధి కల్పనలో ప్రైవేట్ రంగ సంస్థలు, పరిశ్రమలు ఎంతో కీలకమని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం అమీర్‌పేటలోని హోటల్ మేరీగోల్డ్‌లో ఆయన డెయిరీ సంస్థ లోగో ఉత్పత్తుల ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉపాధి కల్పిస్తున్న సంస్థలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డెయిరీ ట్రెండ్స్ సీఈవో శ్యామ్‌సుందర్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, నిర్మాత బండ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

'ఇద్దరికి మించి పిల్లలున్నా పోటీకి అవకాశం కల్పించాలి'

పంజాగుట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్న వారికి సైతం పోటీచేసే అవకాశం కల్పించాలని రాష్ట్ర పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అభిమాన్‌గాంధీ నాయక్ ధరావత్, ప్రధాన కార్యదర్శి జి.విజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ప్రకారం 1995 మే 30 తర్వాత ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

తప్పుడు ఇన్‌వాయిస్‌లతో నిధులు దుర్వినియోగం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నకిలీ ఇన్‌వాయిస్‌లు, రెజ్యూమ్‌లు సృష్టించి అందులో పేర్కొన్న వారి సేవలను వినియోగించుకున్నట్లు క్రియేట్ చేసి భారీగా నిధులు కాజేసిన అస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) రిటైర్డ్ సీహెచ్ఆర్డీ (సెంటర్ ఫర్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ అండ్ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ రూరల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా) అధికారిని డా.బి. లక్ష్మి అలియాస్ భాగ్యలక్ష్మిని సీసీఎస్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిధుల గోల్‌మాల్‌పై అస్కి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జగదీష్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కాగా, పోలీసుల విచారణలో భాగ్యలక్ష్మి నిధులను తన వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నట్లు తేలింది.

వివాహితలకు అందాల పోటీలు అభినందనీయం

బంజారాహిల్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వివాహితలను ప్రోత్సహించడానికి అందాల పోటీలు నిర్వహించడం అభినందనీయమని సినీ నటి ఇంద్రజ అన్నారు. వివాహితల కోసం నిర్వహించనున్న మిసెస్ క్వీన్ తెలంగాణ అందాల పోటీల పోస్టర్‌ను ఆమె శుక్రవారం ఫిలించాంబర్‌లో అలనాటి హీరోయిన్ రాశితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందాల పోటీలు అనగానే ఎక్కువగా అమ్మాయిలకే నిర్వహిస్తుంటారని.. కానీ వివాహితల కోసం మీడియా సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ నెల 14 నుంచి 21 వరకు ఈవెంట్ ఆడిషన్స్ జరుగుతాయని.. డిసెంబర్ 28న గచ్చిబౌలి ఇండోర్‌స్టేడియంలో ఫైనల్ పోటీలు నిర్వహిస్తారన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంద్రజ, రాశి తదితరులు

ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయంగా జరగాలి

● దళిత మేధావుల ఫోరం

పంజాగుట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై అన్ని పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని దళిత మేధావుల ఫోరం డిమాండ్ చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సీ వర్గీకరణను శాస్త్రీయంగా చేపట్టాలని ఏకవ్యక్తి కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు రాసిన లేఖను ఫోరం ప్రతినిధులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, కె.వై రత్నం, కుమారస్వామి, పి.వెంకటేశ్వర్లు, మామిడి నారాయణ తదితరులు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ప్రస్తుతం ద్వేషపూరిత వాతావరణం నెలకొందని గోరటి వెంకన్న అన్నారు. వర్గీకరణ అంశంలో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. డాక్టర్ గోపీనాథ్, ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, కె.వై.రత్నం మాట్లాడుతూ.. మాలలు, మాల మేధావులు మనువాదులు కాదని, వారు ఎప్పుడూ మనువాదుల పాదాల వద్ద ఉండరన్నారు. తెలంగాణలో మాల సామాజికవర్గం అన్ని ఫలాలు అనుభవించిందనే దాంట్లో నిజం లేదని, రాజకీయ మెప్పు కోసం వైరుధ్యాలు పెంచే ప్రయత్నం చేయొద్దని సూచించారు. మాల, మాదిగలు ఒకరినొకరు శత్రువులుగా చూసుకోవద్దని వారు కోరారు. ప్రతి కులంలోనూ మనువాదులు ఉంటారని వారు పేర్కొన్నారు.



ఎస్సీ వర్గీకరణపై ఏకవ్యక్తి కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు రాసిన లేఖను చూపిస్తున్న దళిత మేధావుల ఫోరం ప్రతినిధులు

వర్గీకరణ పేరుతో చిచ్చు పెడుతున్నారు

ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ జి.చెన్నయ్య ఆరోపించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ప్రేమ్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో చిచ్చు పెడతాయని ఆనాడే గుర్తించిన అంబేడ్కర్ రాజ్యాంగంలో పటిష్టమైన ఆర్టికల్స్‌ను పొందుపరిచారన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పునరాలోచించి తమతో కలిసి వస్తే రిజర్వేషన్ల శాతాన్ని పెంచుకోవచ్చన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య తదితరులు



పొదుపు సంఘాల మహిళలతో మేయర్ గద్వాల విజయలక్ష్మి

మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి

మారేడుపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు వ్యాపారం రంగంలో రాణించాలని, మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. ప్రజాపాలన, ప్రజావిజయోత్సవాలను శుక్రవారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో నిర్వహించారు. మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మేయర్ విజయలక్ష్మి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, జోనల్ కమీషనర్ రవికుమార్, బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, మహిళా గ్రూపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పీసీసీ ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్

రాష్ట్రం అన్నిరంగాల్లోనూ అభివృద్ధి

సికింద్రాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని పీసీసీ ఉపాధ్యక్షుడు ఆదం సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలను సీతాఫల్‌మండిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నా, ప్రతిపక్ష పార్టీలు అనవసరంగా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీల మాటలను ప్రజలు నమ్మడం లేదన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మహిళలకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకుడు జితేదంర్‌రెడ్డి, శిల్పా, అభిషేక్, అనిల్‌కుమార్, అమర్‌నాథ్‌గౌడ్, షకీల్‌ఖాన్, వాహీదుద్దీన్, సాగర్, సందీప్, చక్రధర్ పాల్గొన్నారు.



పాటిగడ్డలో కేక్‌కట్ చేస్తున్న డాక్టర్ కోట నీలిమ, విశాల్ సుధాం తదితరులు

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమ పథకాలు

బేగంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అధికారంలోకి యేడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ ప్రజాపాలన, ప్రజా విజయోత్సవవాలు జరుపుతున్నది. ఇందులో భాగంగా సనత్‌నగర్ నియోజకవర్గం, బేగంపేట డివిజన్‌లోని పాట్టిగడ్డలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు విశాల్ సుధాం ఆధ్వర్యంలో వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలిమ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాపాలన సమన్వయ కర్త ఉజ్మాషాకి, నాయకులు షంషుద్దీన్, జగదీష్, మునీర్ ఖాన్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.



భవానీ శంకర్ ఆలయంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్, ముద్దం నరసింహ యాదవ్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

బోయిన్‌పల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేరాలు, దొంగతనాలు జరగకుండా కాలనీ వాసులు బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ సూచించారు. ఓల్డ్‌బోయినపల్లి వెస్లీ టీచర్స్ కాలనీలోని స్వయంభు ప్రసన్న బాలాంజనేయ భవానీ శంకర్ ఆలయంలో స్థానిక కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ రూ.4.50 లక్షల సొంత నిధులతో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ రష్మి పెరుమాళ్ శుక్రవారం సీసీ కెమారాలను ప్రారంభించి మాట్లాడారు. బస్తీలు, కాలనీలోని సీసీ కెమెరాలను స్టేషన్ పరిధిలోని సెంట్రల్ కమాండ్‌కు అనుసంధానం చేసి, నిరంతరం సిబ్బంది పర్యవేక్షిస్తారని అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన కార్పొరేటర్ నరసింహ యాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ గోపాలకృష్ణ, సీఐ లక్ష్మీనారాయణ రెడ్డి, డీఐ శంకర్‌నాయక్, నాయకులు కె. జంగయ్య, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.



బోయిన్‌పల్లి సెంటర్ పాయింట్ వద్ద అక్రమ దుకాణాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, అధికారులు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

బోయిన్‌పల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె హెచ్చరించారు. శుక్రవారం కంటోన్మెంట్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కలిసి స్పెషల్ డ్రైవ్‌ను ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, కంటోన్మెంట్‌బోర్డు అధికారి దేవేందర్, బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. కంటోన్మెంట్ 6వ వార్డు, బోయినపల్లిలోని సెంటర్‌పాయింట్ నుంచి బాపూజీనగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. డీసీపీ రాహుల్‌హెగ్డె మాట్లాడుతూ తాడ్‌బంద్ చౌరస్తా నుంచి సెంటర్ పాయింట్ మీదుగా బాపూజీనగర్‌కు వెళ్లే రహదారులను వ్యాపారులు అక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్పిస్తున్నారని ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. ప్రజల ఫిర్యాదుల మేరకు ఆక్రమణలు తొలగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, కంటోన్మెంట్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పికెట్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు



పాట్నిగుట్ట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ తదితరులు



బోయినపల్లి పోలీస్ స్టేషన్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి తదితరులు

అంబేడ్కర్ సేవలు మరువలేనివి

సికింద్రాబాద్/చిలకలగూడ/అడ్డగుట్ట/మారేడుపల్లి/రాంగోపాల్‌పేట్/బోయినపల్లి/తిరుమలగిరి, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాలో పార్టీలకు అతీతంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. అంబేడ్కర్ చిత్రపటాలకు, చౌస్తాలలోని విగ్రహాలకు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పికెట్ చౌరస్తాలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ డాక్టర్ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. దేశంలోని ప్రతీ ఒక్కరికి హక్కులు ఉండేలా రాజ్యాంగాన్ని రూపొందించారని వారన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ పౌరుడు పాటుపడాలని, అప్పుడే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు.

- సికింద్రాబాద్ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వైవ సంత్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి న్యాయవాదులు నివాళర్పించారు.
- పార్శిగుట్ట చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలలు శ్రద్ధాంజలి ఘటించారు. మెట్టుగూడ చౌరస్తాలో దిశ కమిటీ సభ్యురాలు శారదామల్లేష్ బీజేపీ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హమాల్‌బస్తీలో ఎమ్మార్పీఎస్ నాయకులు దయాల నర్సింగ్ రావు, విజయ్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సందీప్ కాంబ్లే ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తుకారం గేట్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చిలకలగూడ ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమన్ ఫెడరేషన్ కార్యాలయంలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సగరం శ్రీధర్ తదితరులు నివాళులర్పించారు. మాలల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నక్కా మధు లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు కేఎస్ సుధాకర్, చిగురు వెంకటేష్ పూలమాలవేసి నివాళర్పించారు. బొల్లారంలోని సాధన మందిర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బొల్లారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ యూత్‌కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అరవింద్‌లు అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు.
- బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ చౌరస్తాలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డు వద్ద అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బాపూజీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ తదితరులు నివాళులర్పించారు. రాంగోపాల్‌పేట్ డివిజన్, అంబేడ్కర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణ శ్రీనివాస్‌గౌడ్ నివాళులర్పించారు.



సికింద్రాబాద్ సివిల్ కోర్టులో అంబేడ్కర్ వర్ధంతిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంత్‌కుమార్, న్యాయవాదలు



బొల్లారంలోని సాధన మందిర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్థానిక నాయకులు



బాపూజీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జంపన్న ప్రతాప్ తదితరులు



అంబేడ్కర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణాశ్రీనివాస్‌గౌడ్ తదితరులు



బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



మెట్టుగూడ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులరిస్తున్న దిశ కమిటీ సభ్యురాలు శారదామల్లేష్, బీజేపీ నాయకులు



హమాల్‌బస్తీలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



తుకారాంగేట్ చౌరస్తాలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సందీప్‌కాంబ్లే, ప్రీతమ్ తదితరులు



లాలాగూడలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాలల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నక్కా మధు తదితరులు

ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలి: ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు. దర్శనానికి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అన్నారు. మారేడుపల్లిలోని సుబ్రమణ్యస్వామి ఆయల నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ ఛైర్మన్‌గా రేపాల వెంకటేశ్వర్లు, సభ్యులుగా పద్మజా, రామ్మోహన్, పరమేష్, నర్సింగ్, బాలరాజు, శ్రీనివాస్, ఎక్స్‌అఫిషియే మెంబర్‌గా రాజేశ్వర్‌శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నెల 7న శనివారం ఉదయం సుబ్రమణ్యస్వామి షష్టి మహోత్సవం నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా ఛైర్మన్ వెంకటేశ్వర్లు, ఆలయ ఈవో అరుణకుమారి తెలిపారు. 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం, చందన పుష్పాలంకరణ, సహస్రనామార్చన, మహా హారతి, మంత్రపుష్పం భోగము, అన్నదానం వంటి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్, ఆలయ అధికారి ఆండాలు, ఈఓ అరుణకుమారి, నాయకులు సి.సంతోష్ యాదవ్, సి.వైష్ణవి, తెలుకుంట సతీష్‌గుప్తా, శ్యాంసుందర్ రెడ్డి, వేణుగోపాల్, అర్చకులు ఆనంద్, శ్రీవత్సవ, యోగేందర్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలో పవర్ బోరు ప్రారంభం

మారేడుపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. శుక్రవారం మోండా డివిజన్ పరిధిలోని మారేడుపల్లి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో పవర్ బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల చదువుకుంటూ, అదే హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులకు అన్నివేళలా నీటి సదుపాయం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వినోద్‌కుమార్, మాజీ ప్రిన్సిపాల్ నరసయ్యగౌడ్, నాయకులు సంకీ రవీందర్, వైష్ణవి, ఆంజనేయులు, శివ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలాస్వామి

ముగ్గురు బైకు దొంగల అరెస్ట్

9 ద్విచక్రవాహనాలు స్వాధీనం

అడ్డగుట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను చోరీ విక్రస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 9 బైకులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం చిలకగూడ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలాస్వామి వివరాలను వెల్లడించారు. ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన పి. వంశీతేజ(21) ఆటో మెకానిక్. అతడు ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ పోషణ భారం కావడంతో సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీ బాటపట్టాడు. ఉప్పల్, చిలకలగూడ, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పార్కుచేసి ఉన్న బైకులను చోరీ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు వంశీతేజను అదుపులోకి తీసుకుని విచారించగా 7 బైకులను చోరీ చేసినట్టు అంగీకరించాడు.

మరో ఘటనలో సికింద్రాబాద్ అడ్డగుట్టకు చెందిన అడ్డాకుల విజయ్‌కుమార్(44), ఆలకుంట అక్షయ్ (19) స్నేహితులు. కొద్ది రోజుల క్రితం గాంధీ ఆస్పత్రిలో పార్కు చేసి ఉన్న రెండు బైకులను చోరీ చేశారు. వాటిని అడ్డగుట్టకు చెందిన అబ్దుల్ సత్తార్‌కు విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు.



మాట్లాడుతున్న మజ్దూర్ యూనియన్‌ప్రధానకార్యదర్శి శంకర్‌రావు

మజ్దూర్ యూనియన్ విజయం ఖాయం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత్ రైల్వే గుర్తింపు సంఘాల ఎన్నికలలో మజ్దూర్ యూనియన్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యాదర్శి సీహెచ్ శంకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్, తిరుపతి డివిజన్లు ఉన్నాయన్నారు. అన్ని డివిజన్లలో పనిచేస్తున్న రైల్వే కార్మికులు, ఉద్యోగులు మొత్తం ఓటర్లు 73,608 ఉండగా, వారిలో 60,096 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన వెల్లడించారు. మజ్దూర్ యూనియన్ ఏ పార్టీతో సంబంధం లేకుండా రైల్వే కార్మికుల కోసం పోరాడుతున్నదని అన్నారు. ఈ నెల 4, 5. 6 తేదీలలో రైల్వేలో గుర్తింపు పొందిన యూనియన్లకు జరిగిన మజ్దూర్ యూనియన్ మూడోసారి అత్యధిక మెజార్టీతో విజయం సాధించబోతున్నదని అన్నారు. కార్యక్రమలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి రవీందర్ పలువురు యూనియన్ నాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిద్దాం:మంత్రి సీతక్క

- 2కే రన్ పోస్టర్ ఆవిష్కరణ

పంజాగుట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్ల బారిన పడొద్దని, అందరం కలిసి డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిద్దామని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21న తెలంగాణ విద్యాసమితి ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో నిర్వహించనున్న 2కె రన్ పోస్టర్‌ను శుక్రవారం ఆమె సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ 2కె రన్‌లో యువత పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పి.తారక్‌గౌడ్, రేవంత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి, అందె రవికుమార్, భరత్, సంతోష్ నాయుడు, మారుతి, రఘు, శ్రీను నాయక్, అశోక్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మలుపు తిరిగిన వ్యాపారి హత్య కేసు

- నలుగురు కలిసి చంపారు... ఒక్కరు లొంగిపోయారు
- పోలీసుల విచారణలో వెల్లడైన కొత్త విషయాలు

హయత్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పు ఇచ్చిన వ్యాపారిని హత మార్చిన కేసులో కొత్త కోణాలు వెలుగుచూస్తున్నాయి. వ్యాపారిని నలుగురు కలిసి హత్య చేసి ఒక్కడే వచ్చి లొంగిపోయినట్లు తెలుస్తుంది. వడ్డీ వ్యాపారి వేధింపులతో విసిగిపోయిన నలుగురు కలిసి పథకం ప్రకారం ఈ హత్య చేసినట్లు తెలుస్తుంది. నలుగురిలో ఒకరు వ్యాపారికి దూరం బంధువు వరుసకు (బావమర్ది) అవుతారు. సదరు వ్యక్తికి చెందిన ఓ వ్యాపార సముదాయాన్ని మృతుడు కాశీరావు అప్పు కిందకు రాయించుకున్నట్లు సమాచారం. వ్యాపారిని హత్య చేసిన తరువాత శేఖర్‌గౌడ్ ఒక్కరే వచ్చి హయత్‌నగర్ పోలీసులకు లొంగిపోయాడు. అందరు అదే నిజమని భావించారు. శేఖర్‌గౌడ్‌తో పాటు గదిలో ఉండే శంకర్, సాయిలను పోలీసులు అదుపులోకి తీసుకొని తమదైన రీతిలో విచారించగా అసలు నిజం బయట పడినట్లు తెలుస్తుంది. హయత్‌నగర్ బొమ్మలగుడి వద్ద గల సాయి ఫుడ్ కోర్టును కూడా కాశీరావే పెట్టుబడి పెట్టి నడిపిస్తున్నట్లు తెలుస్తుంది. అందులోనే శంకర్, సాయిలు పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం కారులో సదరు వ్యాపారి బంధువు ఇంటికి వచ్చినట్లు స్థానికులు గుర్తించారు. నలుగురు పైన ఉండగానే కాశీరావు అక్కడికి వెళ్లి ఉంటాడు. దీంతో వడ్డీ కోసం వేధించే కాశీరావును హతమార్చాలని నిర్ణయించుకుని హత్య చేసినట్లు తెలుస్తుంది. బలంగా ఉన్న కాశీరావును ఒక్క శేఖర్‌గౌడ్ హత్య చేశాడంటే నమ్మలేక పోయారు పోలీసులు. ముగ్గురు వ్యక్తులు పట్టుకోగా శేఖర్‌గౌడ్ సర్జికల్ బ్లెడుతో దాడిచేసి ఉంటాడని తెలుస్తుంది. పోస్టుమార్టం రిపోర్టులో సైతం బ్లేడు కాశీరావు గొంతులో ఇరుకుని ఉండడంతో డాక్టర్లు తొలగించారు. బలంగా గొంతు కోయడం వల్లనే తుప్పుపట్టిన బ్లేడు గొంతులో ఇరుకుని ఉంటుంది. పోలీస్టుమార్టం రిపోర్టు ఆధారంగానే గదిలో ఉండే మరో ఇద్దరిపైన పోలీసులకు అనుమానం కలిగింది. హత్యలో కాశీరావు బంధువు ఉంటా డని ఎవరు ఊహించలేక పోయారు. కాశీరావు చనిపోయిన తరువాత శేఖర్‌గౌడ్‌ను పోలీసులకు లొంగిపోమ్మని చెప్పిన ముగ్గురు పారిపోయారు. బయట ఉండి అన్ని తాము చూసుకుంటామని చెప్పి శేఖర్‌గౌడ్ లొంగిపోయాలా చేశారు. ఆ తరువాత పోలీసులు విచారణలో భాగంగా శేఖర్‌గౌడ్‌తోపాటు గదిలో ఉండే శంకర్, సాయిలను తీసుకుని వచ్చి విచారిస్తే అసలు విషయం బయటపడినట్లు తెలుస్తుంది.

గూగుల్‌లో వెదికి..

సైబర్ నేరగాళ్లకు చిక్కి..

- యువకుడి నుంచి రూ. 1.10 లక్షలు కొట్టేసిన కేటుగాళ్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన 27 ఏళ్ల యువకుడు డేటా ఎనలిస్టుగా పనిచేస్తున్నాడు. బ్యాంకు నుంచి పర్సనల్ లోన్ తీసుకోవాలనుకున్నాడు. ఏదైనా బ్యాంకు కాంటాక్టు నంబర్ దొరుకుందేమోనని గూగుల్‌లో వెతికాడు. ఈ క్రమంలో అతడికి ఐసీఐసీఐ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ పేరుతో ఒక నంబర్ దొరికింది. ఆ నంబర్‌కు కాంటాక్ట్ చేశాడు. అవతలి వ్యక్తి తాను ఐసీఐసీఐ ప్రతినిధిగా చెప్పుకున్నాడు. లోన్ మంజూరు చేయాలంటే అందుకు అవసరమైన డాక్యుమెంట్లు పంపాలని సూచించాడు. దాంతో బాధితుడు అతడు చెప్పినట్లు కొన్ని డాక్యుమెంట్లు పంపించాడు. మీకు పర్సనల్ లోన్ వచ్చే అవకాశం చాలా తక్కువ అని, అందుకు అవసరమైన అర్హతలు లేవన్నాడు. బ్యాంకు మేనేజర్ సహకారంతో బ్యాక్ ఎండ్ ద్వారా లోన్ మంజూరు చేయిస్తానని, ప్రాసెస్ ఫీజు చెల్లించాలని రూ. 40 వేలు తీసుకున్నాడు. ఆ తర్వాత అకస్మాత్తుగా బ్యాంకు మేనేజర్ తండ్రి ఆరోగ్యం బాగోలేక మృతి చెందాడని, లోన్ ప్రాసెస్ ఆలస్యం అయిందని, కాస్త ఓపిక పట్టాలని సూచించాడు. కొద్దిరోజులకు కొత్త మేనేజర్ వచ్చాడని, మళ్లీ ప్రాసెస్ మొదటికి వచ్చిందని, ఆయనకు ఇవ్వాల్సింది ఇస్తే ప్రాసెస్ పూర్తవుతుందని చెప్పాడు. ఇలా దశలవారీగా రూ. 1.10 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు తర్వాత స్పందించడం మానేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.